
సాక్షి
అనంతపురం
శనివారం । 15 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



రూసా జేఎన్‌టీయూకు భరోసా

అనంతపురం జేఎన్‌టీయూకు 'రూసా' పథకం కింద రూ.88లక్షల విలువ చేసే ప్రాజెక్టులు మంజూరయ్యాయి. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.7°/23.1°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోండి



ముస్లిం మత పెద్దలతో సమావేశమైన ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం: మత సామరస్యానికి ప్రతీక అయిన బక్రీదు పండుగను ఈ నెల 17న ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ గౌతమి శాలి అన్నారు. నగరంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, పోలీసు అధికారులతో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో ముఖాముఖి మాట్లాడారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశంతో సమావేశాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటే పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ టీవీవీ ప్రతాప్, ఏఆర్ డీఎస్పీ మునిరాజా, సీఐలు క్రాంతికుమార్, ధరణికిశోర్, ఆర్.ప్రతాప్‌రెడ్డి, ఆర్ఎస్ఐ జాఫర్, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తులు



అనంతపురం ఎడ్యుకేషన్: మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసే ప్రతిష్టాత్మక 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025' జాతీయస్థాయి అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బి.వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుండె ధైర్యం, నిస్వార్థం, అసాధారణమైన ధైర్యం, అసాధారణ సామర్థ్యాలు, ఆదర్శం, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ, కళలు, సంస్కృతి, ఆవిష్కరణలో పాల్గొని సమాజంపై విస్తృత ప్రభావం చూపిన 5-18 ఏళ్ల లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు చూడాలని ఆదేశించారు. అర్హులైన వారు ఆన్‌లైన్ పోర్టల్ https//awards.gov.inలో జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆధార్ సీడింగ్‌తోనే స్కాలర్‌షిప్



పుట్టపర్తి: విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందాలంటే బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకులు దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 2019-2022 వరకూ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై ఈ సంవత్సరం 9 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. అయితే కొంత మందికి స్కాలర్‌షిప్ జమ కాలేదని తెలియజేశారు. ఇంత వరకూ స్కాలర్‌షిప్ నిధులు జమకాని విద్యార్థులు వెంటనే వారి బ్యాంకుఖాతాకు ఆధార్‌ను సీడింగ్ చేయించుకుని డీబీటీ ద్వారా నగదు జమ అయ్యేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు బ్రెయిన్‌స్ట్రోక్

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని ల్యాండ్ రిఫార్మ్స్ (ఎల్ఆర్) విభాగం తహసీల్దారు వెంకటేశ్వర్లు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. నంద్యాల జిల్లాకు చెందిన ఆయన ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు బదిలీపై వచ్చిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం ఉన్నఫళంగా కుప్పకూలారు. వెంటనే ఆయనను డిప్యూటీ తహసీల్దారు దివాకర్‌రావు, తదితరులు స్థానిక ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైనట్లు నిర్ధారించి శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పరిశీలనలో ఉన్నారు. విషయం తెలుసుకున్న డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి... ఆస్పత్రికి వెళ్లి వెంకటేశ్వర్లు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీశారు. మెరుగైన చికిత్స అందజేయాలని సూచించారు.

జిల్లా అంతటా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఖరీఫ్-2024 ఆశాజనకంగా కనిపిస్తోంది. కోటి ఆశలతో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. విత్తనకాయలు సమకూర్చుకున్నారు. విత్తుకు వేళవడంతో పల్లెల్లో ఎక్కడ చూసినా హడావుడి కనిపిస్తోంది. నేటి నుంచి నెల రోజుల పాటు విత్తుకు మంచి అదను అని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



సేద్యం చేస్తున్న రైతు (ఫైల్)

సాగుకు వేళాయె

- నేటి నుంచి జూలై 15 వరకు విత్తుకు మంచి అదను
- జూలై ఆఖరు వరకు కూడా ఖరీఫ్ సాగుకు అనువే
- ఈ నెల 22న ఏరువాక పౌర్ణమి, ఆరుద్రకార్తె ప్రవేశం
- 3.46 లక్షల హెక్టార్లకు మించి సాగయ్యే అవకాశం

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ సాగుకు వేళయ్యింది. ప్రధాన పంటలైన వేరుశనగ, పత్తి, ఆముదం, మొక్కజొన్న, కంది తదితర పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై 15 వరకు మంచి అదను. కొంచెం ఆలస్యమైనా జూలై ఆఖరు వరకు పంటలు వేసుకున్నా ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఈ నెల 22న ఏరువాక పౌర్ణమితో పాటు ఆరుద్ర కార్తె కూడా ప్రవేశిస్తుండటంతో సాగుకు సరైన సమయంగా భావిస్తున్నారు. విత్తుకునేందుకు ఆరుద్ర కార్తెతో పాటు ఆ తర్వాత జూలై 6న వచ్చే పునర్వసు కార్తెలు కీలకమైనవి. రైతులు ఇబ్బంది పడకుండా ముందస్తుగానే అనుకున్నట్లు 76 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తన వేరుశనగ 40 శాతం సబ్సిడీతో ఇచ్చారు. ఇప్పుడు 30 శాతం రాయితీపై 2,800 క్వింటాళ్ల కందులు, మినుములు, పెసలు, అలాగే 50 శాతం రాయితీతో 50 క్వింటాళ్ల కొర్రలు, రాగులు, అంతేకాకుండా భూసారం పెంచుకునేందుకు 50 శాతం రాయితీతో 250 క్వింటాళ్ల వరకు జనుము, జీలుగు, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు (గ్రీన్‌మెన్యూర్స్) ఇస్తున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.

అంచనాకు మించి ఖరీఫ్ సాగు..

మే రెండో వారం నుంచి క్రమం తప్పకుండా వర్షాలు రావడం, ఇటీవల నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు పడటంతో అంచనాకు మించి ఖరీఫ్ సాగవుతుందని అధికారులు భావిన్నారు. మార్కెట్‌లో వివిధ పంటలకు సంబంధించి మంచి విత్తన రకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అలాగే రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో కూడా కొత్త రకం విత్తనాలు ఉన్నాయి. నల్లరేగడి భూములు కలిగిన ప్రాంతాల్లో చాలామంది రబీలో పప్పుశనగ వేసుకునేందుకు ఖరీఫ్‌లో భూములు ఖాళీగా పెట్టుకుంటారు. అలాంటి చోట్ల స్వల్పకాలిక కొర్ర పంట వేసుకుంటే మంచిదని అధికారులు సూచిస్తున్నారు. ఈసారి పత్తి, ఆముదం, కంది, మొక్కజొన్న పంటల విస్తీర్ణం పెరిగే అవకాశం కనిపిస్తోంది. చిరుధాన్యాలు, పప్పుధాన్యపు పంటలు కూడా వేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నందున ఈ ఖరీఫ్‌లో నాలుగైదు పంటలే కాకుండా పంటల వైవిధ్యానికి పెద్దపీట వేస్తున్నారు. మొత్తం మీద ఈ ఖరీఫ్‌లో 3.46 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి రావచ్చని అంచనా వేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

దండిగా ఎరువులు

ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా 1.11 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించారు. ఇందులో భాగంగా ఏప్రిల్, మే నెలల కోటాలతో పాటు జూన్ కోటా కూడా సరఫరా కావడంతో జిల్లా అంతటా అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. అటు



ప్రధాన పంటలు వేరుశనగ, కంది

ఆర్‌బీకేలు, సొసైటీలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లతో పాటు మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో దాదాపుగా 50 వేల మెట్రిక్ టన్నుల మేర నిల్వ ఉన్నాయి. నాసిరకం ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ రైతులకు అంటగట్టకుండా జిల్లా అంతటా వ్యవసాయ శాఖ అధికారులు నిఘా పెట్టారు. అలాంటి క్రయవిక్రయాలు సాగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు.

కొనసాగుతున్న వర్షాలు



అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపిస్తుండటంతో వర్షాలు పడుతున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 13 మండలాల పరిధిలో 2.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. కణేకల్లు, గుంతకల్లు, ఆత్మకూరు, బెళుగుప్ప, రాప్తాడు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, అనంతపురం, రాయదుర్గం, కళ్యాణదుర్గం, కూడేరు తదితర మండలాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా ఇప్పటికే 140 మి.మీ పైబడి వర్షపాతం నమోదైంది. ఈ 14 రోజుల్లోనే 11 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదవడం విశేషం.

17, 18 తేదీల్లో తేలికపాటి వర్షాలు

రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన లేదు. 17, 18 తేదీల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 32.4 నుంచి 34.2 డిగ్రీలు, కనిష్టం 23.8 నుంచి 24.7 డిగ్రీల మధ్య నమోదు కావచ్చని వెల్లడించారు.

'అనంత' అమాత్యులకు కీలక శాఖలు



పయ్యావుల కేశవ్



సవిత



సత్యకుమార్

- పయ్యావులకు ఆర్థికం.. సత్యకుమార్‌కు ఆరోగ్య, కుటుంబ సంక్షేమం
- సవితకు చేనేత, బీసీ సంక్షేమ శాఖలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం : రాష్ట్ర మంత్రివర్గ కూర్పులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు కీలక శాఖలు దక్కాయి. మొత్తం ముగ్గురికి మంత్రి పదవులు కేటాయించగా.. అందులో ఇద్దరికి ప్రధానమైన శాఖలు వచ్చాయి. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం మంత్రులకు శాఖలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉరవకొండ నుంచి గెలుపొందిన పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక శాఖ ఇచ్చారు. ధర్మవరం నుంచి బీజేపీ తరఫున పోటీచేసి గెలుపొందిన సత్యకుమార్‌కు ప్రాధాన్యత కలిగిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ కేటాయించారు. ఇక పెనుకొండ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సవితకు బీసీ సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ, చేనేత, జౌళిశాఖల బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న ముగ్గురూ మంత్రి పదవులకు కొత్త కావడం విశేషం. ఐదు దఫాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన పయ్యావుల కేశవ్ ఎప్పటినుంచో మంత్రి పదవి కోసం ఎదురు చూస్తున్నారు. ఆయన కల నేటికి ఫలించినట్టయింది.

మళ్లీ బీజేపీకే దక్కిన ఆరోగ్యశాఖ

ఆరోగ్యశాఖ మళ్లీ బీజేపీకే దక్కింది. 2014-19 మధ్య కాలంలో కైకలూరు నుంచి బీజేపీ తరఫున గెలుపొందిన కామినేని శ్రీనివాస్‌కు ఈ శాఖ కేటాయించారు. తిరిగి ఈ దఫా ధర్మవరం నుంచి బీజేపీ తరఫున గెలుపొందిన సత్యకుమార్‌కు ఇచ్చారు. ప్రస్తుతం కేటాయించిన శాఖలన్నీ కీలకమైనవేనని నిపుణులు చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీ సామాజిక వర్గం వారు ఎక్కువగా ఉండటంతో బీసీ సంక్షేమశాఖను పెనుకొండ శాసనసభ్యురాలు సవితకు ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఇద్దరికి, అనంతపురం జిల్లాకు చెందిన ఒకరికి మంత్రి పదవులు దక్కాయి. ఇదిలా ఉండగా ఆరోగ్యశాఖ దక్కించుకున్న సత్యకుమార్ జిల్లాలోనే పెనుకొండ వైద్యకళాశాల నిర్మాణం జరుగుతోంది. వీలైనంత త్వరగా మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేస్తారన్న ఆశతో జిల్లా వాసులు ఉన్నారు.

ఆయుష్షు పెరిగింది!

- గతంతో పోల్చితే భారీగా పెరుగుదల
- 1970-75 మధ్య జాతీయ నగటు ఆయుష్షు 49.7 యేళ్లు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రస్తుతం సగటు ఆయుష్షు 69.5 ఏళ్లు
- పురుషుల్లో 68.3, మహిళల్లో 70.4 ఏళ్లు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వాలు దృష్టి సారించాయి. వైద్య సేవలు మెరుగయ్యాయి. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు పెరగడంతో పాటు వ్యాక్సినేషన్ పక్కాగా అమలవుతుండటంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో సగటు ఆయుర్దాయం భారీగా పెరిగింది. 1970-75 నాటికి జాతీయ సగటు జీవితకాలం 49.7 సంవత్సరాలుండగా 2019-2023 నాటికి సగటున 69.5కి చేరింది. ఈ మధ్య కాలంలో 19.8 సంవత్సరాలు పెరిగింది. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా సర్వే ప్రకారం గతంతో పోల్చితే అనంతపురం లాంటి వెనుకపడిన జిల్లాలో సగటు ఆయుఃప్రమాణం పెరగడం గొప్ప విషయమని నిపుణులు వెల్లడిస్తున్నారు.

- భారతదేశంలో అత్యధిక ఆయుర్దాయం ఉన్న రాష్ట్రాల్లో కేరళ రికార్డు సృష్టించింది. ఇప్పుడక్కడ సగటు ఆయుష్షు 75.2 సంవత్సరాలున్నట్టు తేలింది. ఇదిలా ఉండగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో మహిళల సగటు ఆయుర్దాయం భారీగా పెరిగింది. 1970-75 నాటికి మహిళల ఆయుర్దాయం సగటున 49 సంవత్సరాలు ఉండగా, ఇప్పుడది 70.4కు చేరింది. ఒక్క అనంతపురంలోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ మహిళల సగటు ఆయుష్షు పెరిగింది. గత పదిహేనేళ్లుగా అసాంక్రమిక వ్యాధులు (మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు) వంటివి రావడం కాస్త ఇబ్బందిగా ఉంది. లేదంటే సగటు ఆయుష్షు మరింతగా మెరుగుపడేది.

మెరుగైన మౌలిక వసతులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గడిచిన ఐదేళ్లలో ప్రాథమిక వైద్యంలో మౌలిక వసతులు భారీగా మెరుగయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తపరీక్షలు మొదలుకొని కాన్పులు చేసే స్థాయికి పెరిగాయి. ప్రతి ఆరోగ్య కేంద్రానికీ ఇద్దరు డాక్టర్లు ఉండటం, మందులు అందుబాటులో ఉండటం, పాము కాటు మృతులు దాదాపుగా నిర్మూలించడం వంటివి జరిగాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో సైతం ప్రాథమిక వైద్యం చేయించుకుని ప్రాణాలు నిలుపుకోగలిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికి తోడు ప్రమాద బాధితులకు ఉచిత రవాణా సౌకర్యం గొప్ప ఊరటనిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. వైద్యసేవల విస్తరణతో దిగువ మధ్యతరగతి వారు సైతం బాగా లబ్ధి పొందుతున్నారు.

అనంతపురం జిల్లా జనాభా	23 లక్షలు
శ్రీసత్యసాయి జిల్లా జనాభా	21 లక్షలు
పురుషుల సగటు ఆయుర్దాయం	68.3
మహిళల సగటు ఆయుర్దాయం	70.4

సగటు జీవన కాలం పెరిగిందిలా..

- గ్రామీణ ప్రాంతాల్లో వైద్యానికి సంబంధించిన వసతులు పెరగడం
- ఆరోగ్య రక్షణకు కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు విస్తృతం కావడం
- వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సక్రమంగా నిర్వర్తించడం
- మాతా శిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం
- ప్రజారోగ్యంపై వివిధ స్థాయిల్లో పకడ్బందీ చర్యలు తీసుకోవడం
- ద్వితీయ (సెకండరీ), టెరిచరీ (స్పెషాలిటీ) సేవల్లో గణనీయ మార్పులు తేవడం
- జాతీయ ఆరోగ్యమిషన్ ద్వారా 1.50 లక్షల ఆరోగ్య ఉపకేంద్రాలను ఉన్నతీకరించి సేవలు అందించడం
- ట్రామాకేర్ (ప్రమాద బాధితులకు) మెరుగైన వైద్యం అందించడం
- గ్రామీణ ప్రాంతాల్లో సైతం మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచడం
- ప్రసూతి కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలు

రేపు సివిల్స్ ప్రిలిమినరీ

- ఏడు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- హాజరుకానున్న 2,795 మంది అభ్యర్థులు
- నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి
- అప్పగించిన బాధ్యతలు జాగ్రత్తగా నిర్వర్తించాలి
- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో యూపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ హిమాన్షు కుమార్

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 16న జరగనున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు-2024 పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఏడు కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు 2,795 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఒక కేంద్రాన్ని దివ్యాంగుల కోసం ఏర్పాటు చేశామని చెప్పారు. కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు, పటిష్ట పోలీసు బందోబస్తు కల్పించాలన్నారు. పరీక్ష నిర్వహణపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో యూపీఎస్సీ (న్యూఢిల్లీ) సెక్షన్ ఆఫీసర్ హిమాన్షు కుమార్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రిలిమనరీ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరుగుతుందన్నారు. పేపర్-1 ఉదయం 9.30 నుంచి ఉదయం 11.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.40 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలుగా ఉన్న కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆయా కేంద్రాలకు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. పరీక్ష నిర్వహణకు ఏడుగురు లైజన్ అధికారులను, ఏడుగురు రూట్ అధికారులను నియమించామని వెల్లడించారు. ఇద్దరు అధికారులను రిజర్వులో ఉంచామని చెప్పారు. పరీక్ష కేంద్రం వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. కేంద్రాల వద్ద వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని డీఎంఅండ్‌హెచ్‌ఓకు సూచించారు. ప్రతి కేంద్రం వద్ద ఒక ఎస్ఐ, ఇద్దరు పురుష పోలీసులు, ఇద్దరు మహిళా పోలీసులను బందోబస్తుగా నియమించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రం ప్రవేశ ద్వారం వద్ద మెటల్ డిటెక్టర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేకంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు అప్పగించిన బాధ్యతలును జాగ్రత్తగా నిర్వర్తించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వి నూత్న, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అరగంట ముందే చేరుకోవాలి

ప్రిలిమనరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిర్దేశించిన పరీక్ష సమయాని కంటే అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ-అడ్మిట్ కార్డు ఉంటేనే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. అలాగే ఏదైనా గుర్తింపు కార్డు తప్పక చూపించాలన్నారు. పెన్, పెన్సిల్, ఈ-అడ్మిట్ కార్డు, సెల్ఫ్ ఫొటోలు తప్ప ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులనూ అనుమతించబోరని స్పష్టం చేశారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ (ఫోన్ నంబర్ 8500292992) ఏర్పాటు చేశామన్నారు. 15, 16 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఏదేని సమాచారం, ఫిర్యాదు కోసం అభ్యర్థులు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

అనంతపురంలో పరీక్ష కేంద్రాలు ఇవే...

పరీక్ష కేంద్రం	అభ్యర్థులు
ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల	480
జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్-ఎ	576
జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్ బి	480
ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల	384
కేఎస్ఎన్ ప్రభుత్వ పీజీ మహిళా కళాశాల, ఆర్టీఓ ఆఫీసు దగ్గర	469
ఆర్ట్స్ కళాశాల	398
ఎస్ఎస్‌బీఎన్ జూనియర్ కళాశాల (దివ్యాంగులకు)	8
మొత్తం	2,795

'నేను బడికి పోతా'



- కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- బడిఈడు పిల్లలను వందశాతం బడుల్లో చేర్పించడమే లక్ష్యం
- జూలై 12 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం 'నేను బడికి పోతా' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 6-14 ఏళ్ల పిల్లలందరూ బడుల్లోనే ఉండాలి. డ్రాపౌట్ పిల్లలను తిరిగి స్కూళ్లలో చేర్పించాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. సమగ్ర శిక్ష ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సహకారంతో 'డోర్ టు డోర్' తిరుగుతూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. చదువుకుంటే కలిగే లాభాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలపై పిల్లలతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకోకున్నారు. జూలై 12 వరకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుంది. ఇందులో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులతో ప్రత్యేక కమిటీలను నియమించనున్నారు. ఆయా కమిటీల సభ్యులు వారికి అప్పగించిన పనులను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జూలై 12న వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్లల్లోని పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉన్నారని అధికారికంగా ప్రకటించాల్సి ఉంటుంది. అలాగే అదేరోజు పేరెంట్స్ కమిటీలు కూడా తమ పాఠశాలల పరిధిలోని పిల్లలందరూ బడుల్లో ఉన్నట్లు ప్రకటించనున్నారు.

జిల్లా కమిటీలో ఎవరెవరు ఉంటారంటే...

డీఈఓ, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ చైర్మన్‌గా, ఏపీసీ మెంబర్ కన్వీనర్‌గా, లేబర్ శాఖ డీసీ/ఏసీ, ఐటీడీఏ పీఓ, ఐసీడీఎస్ పీఓ, ట్రైబల్, సోషల్, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ డీడీలు, ఎస్‌సీఎల్‌పీ డీడీ, మెప్మా పీడీ, డీవైఈఓ, ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉంటారు.

మండల కమిటీల్లో..

మండల విద్యాశాఖ అధికారి మెంబర్ కన్వీనరుగా వ్యవహరిస్తారు. ఎంపీడీఓ చైర్మన్‌గా, తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీఓ, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల నుంచి సంబంధిత అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఉర్దూ స్కూల్ హెచ్‌ఎం, కేజీబీవీ ఎస్ఓ, డీఎల్ఎంటీ సభ్యులు ఉంటారు.

గ్రామ కమిటీల్లో..

పేరెంట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న వ్యక్తి గ్రామ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పాఠశాల హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శి, సీఆర్పీ, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ వలంటీరు, అంగన్‌వాడీ ఉద్యోగి సభ్యులుగా ఉంటారు.

క్లుప్తంగా

అనంత ఎడారీకరణపై 17న సదస్సు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ వైవీ మల్లారెడ్డి

అనంతపురం: ప్రపంచ ఎడారీకరణ దినం సందర్భంగా ఈ నెల 17న అనంతపురంలోని సమ్మిళిత ఆర్డీటీ స్కూల్‌లో అనంత ఎడారీకరణ నివారణపై సదస్సు నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. ఎకాలజీ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాధార వ్యవసాయాన్ని కరువుల బారి నుంచి కాపాడేందుకు సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యూత్ రిసోర్స్ సెంటర్ల ద్వారా నిరుద్యోగ, గ్రామీణ యువతకు వృత్తి విద్య నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి కల్పనతో పాటు అదనపు జీవనోపాధుల కార్యక్రమం కింద మహిళలకు వ్యవసాయేతర అదనపు ఆదాయ కార్యక్రమాలు నిర్వహించేలా ఈ సదస్సులో తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు కర్బన ఆదాయం సమకూర్చే వాతావరణ హిత కార్యక్రమాన్ని ప్రోత్సహించడం, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను పెంపొందించడం సదస్సు ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

కోటంక క్షేత్రాన్ని సందర్శించిన ఏఎస్పీ



సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుంటున్న అడిషనల్ ఎస్పీ విజయభాస్కరరెడ్డి

గార్లదిన్నె: మండలంలోని కోటంకలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కరరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఆయనకు ప్రధాన అర్చకులు రామాచార్యులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జంతువులను వధిస్తే కఠిన చర్యలు

ఉరవకొండ: జంతువులను వధించినా, అక్రమంగా రవాణా చేసినా చర్యలు తప్పవని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేశులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పశుసంవర్ధక శాఖ డిప్యూటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జంతు సంరక్షణ కేంద్రాలను జిల్లా, గ్రామ పంచాయతీ స్థాయిలో ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆదేశాల మేరకు నోడల్ అధికారులుగా పశుసంవర్ధక శాఖ డివిజన్ అధికారులు డాక్టర్లు లక్ష్మీకాంతమ్మ, శ్రీనివాసగుప్త, నాంచారయ్య, నాగలింగేశ్వర, రాధిక, రమణమ్మను నియమించినట్లు తెలిపారు. వీరు జిల్లాలో గోవధ చట్టం అమలయ్యేలా చర్యలు తీసుకుంటారన్నారు. త్వరలో జరగనున్న బక్రీద్ పండుగ రోజున జంతు సంరక్షణ చట్టాలు తప్పక పాటించాలన్నారు.

రూసా.. జేఎన్‌టీయూఏకు భరోసా

- జేఎన్‌టీయూఏకు రూ.88 లక్షల విలువ చేసే పరిశోధన ప్రాజెక్టుల మంజూరు
- రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్షా అభియాన్ కింద తొలిసారి పరిశోధన ప్రాజెక్టులు
- 8 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పరిశోధన ప్రాజెక్టుల కేటాయింపు



జేఎన్‌టీయూ(అనంతపురం) పాలక భవనం

అనంతపురం: సాంకేతిక విశ్వవిద్యాలయాలకు తొలిసారి రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్షా అభియాన్ (రూసా) భరోసా దక్కింది. దేశీయంగా ఉన్నత విద్యకు ఆర్థిక చేయూత అందించేందుకు దశాబ్దం క్రితం రూసా తొలి దశ ప్రారంభమైంది. ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ కేవలం సంప్రదాయ విశ్వవిద్యాలయాలకు మాత్రమే రూసా పథకం కింద నిధులు మంజూరయ్యేవి. తాజాగా సాంకేతిక విశ్వవిద్యాలయాలకూ ఈ పథకాన్ని వర్తింపజేశారు.

జేఎన్‌టీయూఏకు నూతన పరిశోధన ప్రాజెక్టులు..

ఏ దేశమైనా ప్రగతి పథంలో సాగాలంటే పరిశోధనలే కీలకం. ఈ క్రమంలో విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పించడంపై కేంద్రం దృష్టి సారించింది. దీంతో దేశీయంగా ఉన్నత విద్యకు ఆర్థిక చేయూతనిచ్చేలా రూసా పథకం కింద ప్రత్యేకంగా నిధులు సమకూరుస్తూ పరిశోధనలు చేపట్టేలా ప్రోత్సాహిస్తోంది. ఇప్పటి వరకూ సంప్రదాయ విద్యాబోధన సాగించే యూనివర్సిటీలకు మాత్రమే నిధులు సమకూర్చిన కేంద్రం... తాజాగా సాంకేతిక విద్యనందించే విశ్వవిద్యాలయాలకూ చేయూతనిస్తోంది. దీంతో జేఎన్‌టీయూఏకు ఏకంగా రూ.88 లక్షలు విలువ చేసే 8 పరిశోధన ప్రాజెక్టులు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టులను రెండేళ్ల కాలవ్యవధిలో పూర్తి చేయాలనే నిబంధన విధించారు. కాగా, ప్రాజెక్టుల కేటాయింపుపై జేఎన్‌టీయూఏ వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. పరిశోధన ప్రాజెక్టులకు ఎంపికైన ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను అభినందించారు. జేఎన్‌టీయూను ఆవిష్కరణల కేంద్రంగా మార్చేందుకు ఈ ప్రాజెక్టులు కీలకం కానున్నాయన్నారు.

మంజూరైన ప్రాజెక్టులు ఇవే...

- నానో కాంక్రీట్ స్థిరత్వాన్ని అంచనా వేసే ప్రాజెక్టును సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి బి.అజితకు కేటాయించారు. ఇందు కోసం రూ.10లక్షలు కేటాయించగా తొలి దశలో రూ.4.40 లక్షల నిధులను మంజూరు చేశారు.
- మూర్ఛ రోగులకు తక్కువ ఖర్చుతోనే ఇంటి వద్దనే వైద్య పరీక్ష చేసుకునే పరికరాన్ని రూపకల్పన చేసే ప్రాజెక్ట్ బాధ్యతలను ఎలక్ట్రానిక్స్ విభాగంలో డాక్టర్ ఎస్.అరుణామస్తానీకి కేటాయించారు. ఇందు కోసం ఈసీఈ విభాగానికి రూ.11 లక్షలు నిధులు కేటాయించగా రూ.4.84 లక్షలు మంజూరయ్యాయి.
- లర్నింగ్ అల్గరిథమ్‌ను ఉపయోగించి క్లిష్టమైన జబ్బుల మెడికల్ ఇమేజ్‌ను విశ్లేషించేలా ఎలక్ట్రానిక్స్ విభాగం ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్‌కు ప్రాజెక్ట్ కేటాయించారు. ఇందు కోసం ఈసీఈ విభాగానికి రూ.11 లక్షలు కేటాయించి, రూ.4.84 లక్షలు మంజూరు చేశారు.
- రూ. 12 లక్షల వ్యయంతో కూడిన బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్ ఎలక్ట్రోడ్ మెటీరియల్ రూపకల్పన ప్రాజెక్ట్ బాధ్యతలను కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ బి.దిలీప్‌కుమార్‌కు అప్పగించారు. ఇందు కోసం రూ.12 లక్షలు కేటాయించగా, రూ.5.28 లక్షలు మంజూరు చేశారు.
- ఇథనాల్ బయోఫ్యూయల్ వాడకానికి కావలసిన సపరేషన్ టెక్నిక్స్ పరికరాలను పరీక్షించే ప్రాజెక్టును ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణకు కేటాయించారు. ఇందుకోసం కెమికల్ ఇంజినీరింగ్ విభాగానికి రూ.11 లక్షల నిధులు కేటాయించారు. ఇందులో రూ.4.84 లక్షలు మంజూరయ్యాయి.
- మేగ్నటో హైడ్రోడైనిక్ కన్వోక్టివ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఇన్ మైక్రోపోలార్ ఫ్లూయిడ్ అంశంపై పరిశోధన బాధ్యతను మేథమేటిక్స్ విభాగం ప్రొఫెసర్ ఆర్. భువనవిజయకు అప్పగించారు. ఇందు కోసం రూ.10 లక్షలు కేటాయించగా, తొలి దశలో రూ.4.40 లక్షలు మంజూరు చేశారు.
- వృద్ధాప్యం పైబడిన వారు నడిచేటప్పుడు కింద పడకుండా ఉండేలా ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్, మెషీన్ లర్నింగ్ ద్వారా ఓ జాకెట్ రూపకల్పన బాధ్యతను ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డికి అప్పగించారు. ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ.10 లక్షలు కాగా, రూ.4.40 లక్షలు మంజూరు చేశారు.
- వృథా ఇనుమును ఉపయోగించి కాంక్రీట్‌లో స్థిరత్వాన్ని పెంపొందించేలా ఆవిష్కరణ చేసిన జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్‌కు రూ.11 లక్షల విలువైన ప్రాజెక్టును మంజూరు చేశారు. ఇందులో తొలి విడతగా రూ.4.84 లక్షలు మంజూరు చేశారు.

సీసీఎస్ వృద్ధాప్య ఆర్థిక సాయం కోసం దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం క్రైం: ఈ ఆర్థిక సంవత్సరానికి గాను సీసీఎస్ నుంచి వృద్ధాప్య సాయం కోసం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఆ సంస్థ ఉద్యోగుల సంఘం ప్రచార కార్యదర్శి ఎస్.రామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కనీసం 5 ఏళ్ల సభ్యత్వం కలిగిన వారు అర్హులు. 63 ఏళ్ల వయ నుండి, భద్రతా పథకంలో సభ్యులుగా ఉన్నవారు అర్హులు కాదన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత ఫారంను భర్తీ చేసి ఈ నెల 30వ తేదీలోపు అనంతపురం ఆర్టీసీ డిపో వద్ద అందజేయాలి. పూర్తి వివరాలకు 99854 31084లో సంప్రదించవచ్చు.

ఆరు ఇసుక టిప్పర్ల పట్టివేత

శింగనమల: మండలంలోని ఉల్లికల్లు, సలకంచెరువు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 6 టిప్పర్లను పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున నాయనపల్లి క్రాస్ వద్ద ఎస్‌ఐ చంద్రశేఖర్ అదుపులోకి తీసుకున్నారు. ఉల్లికల్లు సమీపంలోని పెన్నానది, సలకంచెరువులోని వంక నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పుట్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. గురువారం రాత్రి పుట్లూరు మండలం ఎ.కొండాపురం వద్ద వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో పెద్దపప్పూరు మండలానికి చెందిన నాగేంద్ర అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మానవత్వం... 'రమణీ'యం

- నిరుపేదలను అక్కున చేర్చుకుంటున్న అమ్మ సంస్థ
- యువతకు ఆదర్శంగా నిలుస్తున్న తరిమెల రమణారెడ్డి



బాధితుడికి సాయమందిస్తున్న 'అమ్మ' సంస్థ వ్యవస్థాపకుడు రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఆపదలో ఉన్నవారి గురించి తెలియగానే ఆయన చలించిపోతారు. డబ్బులేక అర్ధంతరంగా చదువు ఆపేస్తున్న నిరుపేద విద్యార్థులను చూసిన వెంటనే వారి చదువులకు ఆర్థిక చేయూతనందిస్తారు. ఎక్కడ బాధతప్త హృదయాలు విలవిలలాడినా నేనున్నానంటూ ఆపన్న హస్తమందించే మూర్తీభవించిన మానవత్వం ఆయన సొంతం. అమ్మ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసి వందలాది అనాథలు, అభాగ్యుల వ్యథాభరిత జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆయనే తరిమెల రమణారెడ్డి. ఆయన సేవలకు పాతికేళ్లు నిండాయి. ఈ క్రమంలో 'అమ్మ' సంస్థ స్థాపనకు దారి తీసిన పరిణామాలు ఆయన మాటల్లోనే....

మధ్యతరగతి రైతు కుటుంబమే...

వాస్తవానికి మాది శింగనమల నియోజకవర్గంలోని తరిమెల గ్రామం. మధ్య తరగతి రైతు కుటుంబమే. మా నాన్న జయప్రసాదరెడ్డి సాధారణ రైతు. అమ్మ స్వరాజ్య లక్ష్మి పుట్టింది చీమలవాగుపల్లిలో. మా అమ్మ, నాన్న ఉదార స్వభావమే నాకూ వచ్చిందనుకుంటా. దీంతో ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నారంటే సాయం చేయడాన్ని బాధ్యతగా స్వీకరిస్తా. చేయాలన్న తపన, నిస్వార్థమైన సేవకు డబ్బే కావాలని అనుకోవడం లేదు. విశాలమైన హృదయం ఉంటే అన్నీ వాటంతటే సమకూరుతాయని నా భావన.

రక్తదానం స్ఫూర్తితో

నా చదువంతా అనంతపురంలోనే సాగింది. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ నిండు గర్భిణికి రక్తం అవసరమని తెలిసి, వెళ్లి ఇచ్చాను. ఆ సమయంలో ఆమె కళ్లలో కనిపించిన కృతజ్ఞతాభావం నన్నెంతో కదిలించింది. నేను చేసింది చిన్న సాయమే... అయినా ఆ సమయంలో అది నాకెంతో ఆనందాన్నిచ్చింది. ఆ ఆనందాన్ని సదా పొందాలనుకున్న నేను మరో పది మందికి సాయం చేయాలన్న ఆలోచనతో 1998, ఆగస్టు 26న అమ్మ సంస్థను ప్రారంభించాను. తల్లిలా అనురాగం, ప్రేమ పంచాలన్న సదాశయంతో ప్రారంభమైన నా సేవా ప్రస్థానం దిగ్విజయంగా 25 వసంతాలు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది.

చివరిశ్వాస వరకూ..

మా ఊరు తరిమెల పేరు వినగానే ఎవరికైనా త్యాగనిరతి కలిగిన ప్రజానాయకుడు తరిమెల నాగిరెడ్డి గుర్తొస్తారు. బహుశా ఆయన ప్రభావం మా వాళ్లందరిపై ఎంతో కొంత చూపుతోంది. నా సేవా ప్రస్థానానికి ప్రేరణ కూడా ఆయనే. పేదల సేవలోనే చివరి శ్వాస వరకూ ఉండాలన్నది నా ఆశయం. మరి భగవంతుడు ఎలా నడిపిస్తాడో చూడాలి. అన్నార్థులు, అనాథలు, వృద్ధుల దీనగాథలు వింటే ఎంతో కొంత సాయం అందించాలని అనుకుంటా. విద్య, వైద్యం, ఉపాధి కోసం ఇప్పటి వరకూ రూ.లక్షల్లో సాయం అందించి ఉంటాను. ఓ సారి ఓ అభ్యాగుడి దీనావస్థను తెలుసుకున్న వెంటనే వెళ్లి పరామర్శించాను. ఆ సమయంలో నా వద్ద ఏమీ లేదు. దీంతో తెలిసిన వారితో అప్పు చేయాల్సి వచ్చింది. ముఖ్యంగా ఒకే కుటుంబంలో ఐదుగురికి గుండె ఆపరేషన్లు చేయించాల్సి వచ్చినప్పుడు ఎన్నో వ్యయప్రయాసలను ఎదుర్కొవాల్సి వచ్చింది. ప్రాణాలు నిలబడిన తర్వాత వాళ్ల కన్నా నేనే ఎంతో ఆనందపడ్డాను.

ప్రతిఫలం ఆశించలేదు

ఇన్ని సేవలు చేస్తున్నానంటే రాజకీయాల్లోకి వస్తానో లేదా ప్రభుత్వ సాయం కోసమో అన్న విమర్శలు కూడా నేను ఎదుర్కొన్నా. చాలామంది ఏవేవో ఊహించుకున్నారు. వాస్తవానికి నేను ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించి ఈ సేవ చేయడం లేదు. అందరూ బాగుండాలనే తపనతోనే నా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నా.

కుల ప్రస్తావన బాధ కల్గించే అంశం

నేడు సామాన్యుల నుంచి మేధావులుగా ముద్రపడిన వారు సైతం కొందరు కుల ప్రభావంతో నైతిక విలువలు మరిచిపోతున్నారు. ఇది బాధాకరం. మా సేవా కార్యక్రమాలలో చాలా మందిని భాగస్వాములు చేద్దామని తొలుత అనుకున్నా. అయితే వారు పబ్లిసిటీ పిచ్చిలో పడి చేస్తున్న హంగామా చూసిన తర్వాత దూరంగా పెట్టాల్సి వచ్చింది. సేవ కార్యక్రమాల్లో కులాన్ని చూడడం మంచిది కాదు.

చిన్నప్పటి నుంచే విలువలు నేర్పాలి

రాబోయే తరాలు నిస్వార్థంగా, మానవత్వంతో ఉండాలంటే మొదట వారి బాల్యం నుంచే విలువలతో కూడి జీవన విధానాన్ని తల్లిదండ్రులు నేర్పాలి. ఉపన్యాసాలు, ఉచిత సలహాలతో సమాజం ఎన్నటికీ బాగుపడదు. ఆచరణలో పెద్దల తీరు మార్గదర్శకంగా ఉండాలి. సాటి మనిషి కష్టాల్లో ఉంటే సాయపడే మనస్తత్వాన్ని వారికి అలవర్చాలి. సేవలోనే దైవత్వం ఉందని నమ్మాను. ఆ భావాన్ని యువతరంలో నింపడానికి అమ్మ సంస్థ ఎన్నో వ్యయప్రయాసలను భరిస్తోంది.

70,619 క్వింటాళ్ల విత్తన పంపిణీ



అనంతపురం అగ్రికల్చర్: విత్తన వేరుశనగ పంపిణీలో భాగంగా శుక్రవారం నాటికి 78,018 మంది రైతులకు 70,619 క్వింటాళ్ల పంపిణీ పూర్తయినట్లు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. జిల్లాకు 76 వేల క్వింటాళ్ల రాయితీ విత్తనం కేటాయించగా ఇప్పటి వరకూ 82,022 మంది రైతులు 72,395 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరోపక్క కందులు, పెసలు, మినుములు, రాగులు, కొర్రలు, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ, రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి.

హంపాపురం వెల్‌నెస్ సెంటర్‌లో శిలాఫలకం ధ్వంసం



ధ్వంసమైన శిలాఫలకం

రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌పై గురువారం రాత్రి టీడీపీ నేతలు దాడి చేశారు. ద్విచక్ర వాహనాలపై వచ్చిన వారు తొలుత వెల్‌నెస్ సెంటర్ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అనంతరం అక్కడే ఉన్న గ్రామ సచివాలయం, ఆర్బీకే శిలాఫలకాలను ధ్వంసం చేసేందుకు వెళుతుండగా నిద్రమేల్కొన్న స్థానికులు గమనించి గట్టిగా కేకలు వేయడంతో ఉడాయించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మాదాపురం అంగన్‌వాడీ కేంద్రానికి టీడీపీ నేతల తాళం



అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేస్తున్న టీడీపీ నేత

సాక్షి, పుట్టపర్తి: 'ఇది రామగిరి. పరిటాల అడ్డా. ఇక్కడ మేము చెప్పిందే జరగాలి' అంటూ టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మండలంలో ఏదో ఒక చోట ఇలాంటి దౌర్జన్యాలు పరిపాటిగా మారాయి. తాజాగా శుక్రవారం మాదాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేశారు. ఉదయం కేంద్రంలో చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న సమయంలో స్థానిక టీడీపీ నేతలు ప్రకాష్, పోతన్న, సురేష్, చిరంజీవి తదితరులు అక్కడకు చేరుకుని అంగన్‌వాడీ టీచర్ విధులను అడ్డుకున్నారు. దళితురాలైన టీచర్ చంద్రకళను బెదిరించి బయటకు గెంటేసి, కేంద్రానికి తాళం వేశారు. దీంతో కార్యాలయం బయటే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు అంగన్‌వాడీ టీచర్, ఆయా అందజేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నడూ ఇలాంటి దుశ్చర్యలను తాము చూడలేదని, ప్రభుత్వం మారిన తర్వాత గ్రామంలో ప్రశాంత వాతావరణానికి భంగం వాటిల్లేలా టీడీపీ నేతలు ప్రవర్తిస్తున్నారంటూ మండిపడ్డారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Tech. ADMISSIONS

■ AP EAPCETలో క్వాలిఫైడ్ స్టూడెంట్స్‌కి, B.Tech (Any Branch)లో ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. క్వాలిఫై కాని వారు Only హాస్టల్ ఫీజు కట్టుకోవలెను. కాలేజ్ ఫీజు ఉండదు. సంప్ర: జి.మురళీ, సెల్ : 9030661651. అనంతపురము. [A-1244]

REAL ESTATE

SHOP FOR RENT

■ షాపు రూమ్ బాడుగకు, శ్రీకంఠం సర్కిల్ నందు బస్టాండ్ కు పోవు దారిలో కమర్షియల్ షాపు రూమ్ బాడుగకు కలదు. సంప్రదించండి . Cont :7013324050. [A-153]

LEASE / RENT

■ గుత్తి-గుంతకల్ మధ్యన, నేషనల్ హైవేకి @ పాత కొత్తచెరువు 1000 చ.అ గల షెడ్+ 75 సెంట్ల ఓపెన్ పార్కింగ్ ప్లేస్, దాబా హోటల్స్/ గోడౌన్/ వర్క్ షాప్స్ కి లీజ్/రెంట్‌కి ఇవ్వబడును. 9449986123, 9347039123. [A-143]

OPEN PLOTS FOR SALE

■ గుత్తి-గుంతకల్ మధ్యన, నేషనల్ హైవేకి, నియర్ పాత కొత్తచెరువు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరియాలో, ఓపెన్ ప్లాట్లు & కమర్షియల్ ప్లాట్లు అమ్మకానికి కలవు. మీ పెట్టుబడికి గ్యారెంటీ రాబడి @ స్పాట్ రిజిస్ట్రేషన్, 9449986123, 9347039123. [A-144]

PLOT FOR SALE

■ బంపర్ ఆఫర్: 5లక్షలకే 3 ప్లాట్లు, 3.50లక్షలకే 2 ప్లాట్లు, 2.00లక్షలకే 1 ప్లాట్లు. తాడిపత్రి టు గుత్తి హైవే పైన వేములపాడు తర్వాత మోడల్ స్కూలు ఆనుకొని 43 ఎ॥ల సువిశాలమైన వెంచర్‌లో అప్రూవ్డ్ ప్లాట్లు కొనండి. ఉచితంగా ఎస్‌వీఆర్ ఎర్రచందనము పార్కులో మొక్కను పొందండి. సం.ప్ర: 94907 63299. [L-800663]

PLOTS FOR SALE

■ PVKK అగ్రికల్చర్ కాలేజ్ దగ్గర తక్కువ ధరలో డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్స్ కలవు. ల్యాండ్స్ కావలెను. మా ఆఫీస్‌కు స్టాఫ్ మరియు మార్కెటింగ్‌కు స్త్రీ / పు కావలెను. సంప్ర : 7997774369. [A-1248]

SERVICES

ఉష ఫ్యాషన్ డిజైనర్

■ టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్, మారుతీ నగర్, 3వ క్రాస్, ఆర్.యస్. రెసిడెన్సీ, ఫ్లాట్ నెం. 103, అనంతపురము. సంప్ర: సెల్ : 72072 12027. [A-161]

WANTED

■ అనంతపురములోని పేరుగాంచిన Inter College నందు Tutors, Wardens, Seavengers, Attenders, Sweepers, Physics, English Lecturers కావలెను. 9866117303, 6281158454 [A-7003]

■ WANTED Required P.E.T s, Principal and High School Teachers and Lectures for all subjects. Interview Date: 19, 20 June 2024. Contact: 8019855845. [A-7002]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217. [M-1185215]

■ Sanjay Ghodawat యూనివర్సిటీకి B.Tech / Admisions చేయుటకు Lady Tele Counselleros కావలెను. Office or Work From Home. Qlf: Any Degree. సంప్రదించండి: 99598 99798, 96400 60006. [NA-23499]

■ కావలెను. ఎలెక్ట్రిసిటీ మీటర్లకు డోర్ టు డోర్ సర్వే చేయుటకు, కస్టమర్ డేటా ఎంటర్ చేయుటకు 18-35 సం॥. వయస్సు గల స్త్రీ/ పురుషులు కావలెను. అర్హత : 10th & above ఇంగ్లీష్ వ్రాయడం, చదవడం అవసరం. # జెష్టిక్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్. సెల్ : 9014981414, 9059451164. [A-159]

■ WANTED పంపుబాయ్స్ బెంగుళూరు హైవే రాప్తాడు, నయారా పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు పంపుబాయ్స్ కావలెను. సంప్రదించండి : 9440270324. [A-163]

■ PCMR E.M. SCHOOL Wanted Social Studies Teachers for High School and Primary Classes 1st to 5th & 6th to 10th & Physics Teacher 6 to 10th. Ph: 9505292219, 9885386684. [A-762314]

■ Job Openings : అనంతపురం లో, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ - 3, Q: MBA (MARKETING), అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన శాలరీ. సంప్ర: ఉదయ్ ఫుడ్ & బేవరేజెస్, ATP. సెల్: 9908612561. [A-1245]

■ తిరుపతి, తిరుమలలో & మంగంపేట పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, SO, ASO లు కావలెను. భోజనము, వసతి కలదు. 9100518607, 9515488473. [T-2116]

■ దండపాని రియల్‌ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ అర్హత ఇంటర్ ఆపైన, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఫిక్స్‌డ్ శాలరీ 10000, నో టార్గెట్ అనుభవం కలవారికి ప్రాధాన్యత ప్లాట్ నెంబర్ 204, లోటస్ గ్రాండ్, రాంనగర్ అనంతపురం Cont: 6300725354 [A-162]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'మచ్చా' విధ్వంసకర బ్యాటింగ్


- సౌత్‌జోన్ టోర్నీలో నెల్లూరుపై అనంత జట్టు విజయం




సెంచరీ సాధించిన మచ్చా దత్తారెడ్డి

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-23 సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీలో అనంత బ్యాటర్ మచ్చా దత్తారెడ్డి దూకుడు ప్రదర్శించాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో జట్టుకు భారీ స్కోర్ సమకూర్చాడు. అనంత క్రీడాగ్రామం వేదికగా సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. అనంతపురం, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో అనంతపురం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. జట్టు కెప్టెన్ మచ్చా దత్తారెడ్డి 50 బంతుల్లో 15 సిక్సర్లు, 2 ఫోర్లతో 122 పరుగులు సాధించాడు. మరో బ్యాటర్ అర్జున్ టెండూల్కర్ 15 బంతుల్లో 3 సిక్సర్లు, 4 ఫోర్లతో 36 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 23.4 ఓవర్లలో 175 పరుగులకే కుప్పకూలింది. 39 పరుగులతో అనంతపురం జట్టు విజయం సాధించింది.

పాము కాటుతో కౌలురైతు మృతి





మృతులు గంగాద్రి లక్ష్మన్న

తలుపుల: మండలంలోని గంజివారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కౌలు రైతు బి.గంగాద్రి (43) పాము కాటుతో మృతి చెందారు. గురువారం సాయంత్రం తాను కౌలుకు చేస్తున్న అదే గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి పొలంలో పశుగ్రాసం కోస్తుండగా పాము కాటేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే తలుపులలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటలక్ష్మమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మరో రైతు...

కనగానపల్లి: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం బోగినేపల్లికి చెందిన గవ్వల లక్ష్మన్న (60)కు కనగానపల్లి మండలం తగరకుంట గ్రామ సమీపంలో పొలం ఉంది. శుక్రవారం ఉదయం పొలం వద్దకెళ్లిన ఆయన అప్పటికే కింద పడి ఉన్న విద్యుత్ తీగలను గమనించి పక్కనే ఉన్న కట్టెలపైకి వేసేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో విద్యుత్ ప్రసరిస్తున్న తీగలు మీదపడడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. చుట్టుపక్కల పొలాల్లో ఎవరూ లేకపోవడంతో ఈ విషయాన్ని గుర్తించలేకపోయారు. ఉదయం 8 గంటలకు పొలానికి వెళ్లిన మనిషి మధ్యాహ్నం 2 గంటలైనా ఇంటికి రాకపోవడంతో భార్య ఈశ్వరమ్మ పొలం వద్దకెళ్లింది. విద్యుత్ తీగలు మీదపడి విగతజీవిగా పడి ఉన్న భర్తను గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

అన్ని పాఠశాలల్లో మిషన్ లైఫ్ కార్యక్రమాలు నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ నిధియాదేవి

రాప్తాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ లైఫ్ కార్యక్రమాలను అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా నిర్వహించాలని ఉపాధ్యాయులను సమగ్ర శిక్ష ఏపీసీ నిధియాదేవి ఆదేశించారు. రాప్తాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. తడి, పొడి చెత్త వేరు చేసి ఎరువుగా మార్చే విధానాలపై ఆరా తీశారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగించబోమని, మొక్కల పెంపకాన్ని విరివిగా చేపడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మిషన్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఈ-వేస్ట్ సేకరణపై కార్యక్రమాలు ఎలా నిర్వహించాలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మిషన్ లైఫ్ రోజు వారి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని, ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎకో క్లబ్‌ల సహకారంతో కార్యక్రమాలు చేపట్టేలా చూడాలని ఎంఈఓ మల్లికార్జునను ఆదేశించారు. అనంతరం స్టూడెంట్ కిట్స్ మండల స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. విద్యార్థి కిట్లకు సంబంధించి ఏ వస్తువులు వచ్చాయి. ఏఏ పాఠశాలలకు ఎంత మేర పంపిణీ చేశారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠ్య, నోట్ పుస్తకాలను వెంటనే విద్యార్థులకు పంపిణీ చేసేలా ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలివ్వాలని ఎంఈఓ మల్లికార్జునకు సూచించారు. బ్యాగులు, బెల్టులు, షూలు తదుపరి తేదీలు ప్రకటించిన తర్వాత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు మల్లికార్జున, కుళ్లాయప్ప, సీఎంఓ గోపాల్, చంద్రశేఖరరెడ్డి, హెచ్ఎం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రండి



రక్తదాతను అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్: ఆపద సమయంలో ఉన్న వారికి రక్తం అందించి ప్రాణాలు కాపాడాలని ప్రజలకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం అనంతపురం పాతూరులోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాతల శిబిరాల నిర్వాహకులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ప్రసవ సమయంలో రక్తం అందక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులుంటాయని, అలాంటి సమయంలో రక్తం అందించి తల్లి, బిడ్డ ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. ప్రతి రక్తదాత నిజమైన హీరోలని అభివర్ణించారు. డెంగీ, మలేరియా వ్యాధులను ఎదుర్కోవడానికి అందరూ సంసిద్ధంగా ఉండాలన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను వివరించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థకు తమ వంతుగా సేవలందించిన సప్తగిరి క్యాంఫైర్ ఉపాధ్యక్షుడు హనీఫ్, డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, డీఎల్ఏటీఓ అనుపమ జేమ్స్‌ను కలెక్టర్ సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హస్తకళలను ఆదరించాలి


హస్తకళ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే హస్తకళలను ప్రోత్సహించాలని లేపాక్షి ఎంపోరియం అధికారులు విజ్ఞప్తి చేశారు. ఐదు రోజుల పాటూ సాగే హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనంతకు విచ్చేసిన హస్తకళాకారుల అల్లికల ఉత్పత్తులు అందరిని ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. కొండపల్లి బొమ్మలు, సంప్రదాయ అద్దకాలు, తోలుతో చేసిన వస్తువులు, వివిధ రకాల దేవతామూర్తుల, కళాఖండాల అమరికలు, లోహపు వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. శతాబ్దాలుగా వస్తున్న తమ హస్తకళను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. కృత్రిమంగా యంత్రాలపై తయారైన వస్తువులతో పోలిస్తే హస్తకళా ఉత్పత్తులు ఎంతో నాణ్యంగా ఉంటాయని పేర్కొన్నారు. అంతకు ముందు కళాభిమానులు బారులు తీరి హస్తకళా ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో లేపాక్షి సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో మెలకువలు


చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

అనంతపురం కల్చరల్: పెన్సిల్ ఆర్ట్, పాట్ డ్రాయింగ్, లెటర్ ఆర్ట్, కలరింగ్‌లో చిన్నారులు మెలకువలు నేర్చుకుని అద్భుతమైన చిత్రాలతో ఆకట్టుకున్నారు. శుక్రవారం అనంత బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత డ్రాయింగ్ శిక్షణ శిబిరం స్థానిక ఇందిరా నగర్‌లో జరిగింది. ప్రముఖ చిత్రకారుడు కత్తి విజయ్‌కుమార్ చిన్నారులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలోత్సవ్ కమిటీ సభ్యులు సావిత్రి, శ్రీనివాస్, రాజ్‌మోహన్, కళాసాగర్ ఆర్ట్ స్కూల్ విజయ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. కేవలం చదువు, ర్యాంకులతో మాత్రమే కాకుండా కళలను చదువుకు అనుసంధానం చేసే ప్రక్రియను నేర్చుకోవాలని చిన్నారులకు సూచించారు. ముఖ్యంగా మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు చక్కటి బొమ్మలు గీచే నైపుణ్యం అవసరమన్నారు. అలాగే భాషా సంబంధిత పాఠ్యాంశాలను చక్కటి రాతతో రాసేలా ఉచిత శిక్షణ ఇచ్చామని తెలిపారు. అనంతరం ప్రతిభ కనపరచిన చిన్నారులకు బహుమతులు, అందరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు.

అన్నదానం


ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట అన్నదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: జస్టిస్ రంగారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో సాయిట్రస్టు నిర్వాహకులు శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. జిల్లాకు చెందిన జస్టిస్ రంగారెడ్డి హైకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు. ఆయన మృతి చెందిన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్నదానం చేశారు.

ఏపీ హంస నగర కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

అనంతపురం మెడికల్: ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అనంతపురం నగరశాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై ంది. శుక్రవారం నగరంలోని పాతూరు సీడీ ఆస్పత్రిలో హంస జిల్లా అసోసియేషన్ జిల్లా కన్వీనర్లు ఎస్ఎండీ రఫీ, కోకిల చాముండేశ్వరి అధ్యక్షతన జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెపల్లి పామన్న, ఎన్నికల అధికారులుగా వెంకట కృష్ణమూర్తి, లక్ష్మి వ్యవహరించారు.

కార్యవర్గ సభ్యులు..
హంస నగరాధ్యక్షుడిగా కుల్లాయ బాబు (ఫార్మసిస్టు), అసోసియేట్ అధ్యక్షురాలిగా శోభారాణి (నర్సింగ్ కాలేజీ బోధకురాలు), ఉపాధ్యక్షులుగా అలివేల మంగమ్మ, తిప్పేరుద్రమ్మ (స్టాఫ్‌నర్సు, జీజీహెచ్), గిరిధర్ రెడ్డి (ఎంపీహెచ్ఈఓ), రామాంజనేయులు (యూడీసీ, జీఎంసీ), భక్తర్ అలీఖాన్ (డిప్యూటీ డీఎస్ఓ), విశాలాక్షి (ట్రెనింగ్ పీహెచ్ఎన్), ఎస్.లోకేశ్వర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎల్లప్ప (ఎంపీహెచ్ఈఓ, ట్రెనింగ్ స్కూల్), సహాయ కార్యదర్శిగా కే సుదర్శన్ రెడ్డి (కాంపౌడర్ ఆయుష్), ఉమాదేవి, జమున, సంధ్య అరుణ (స్టాఫ్‌నర్సులు), మంజుల దేవి (డీఐఓ కార్యాలయం) ఎన్నికయ్యారు.


తపోవనం సర్కిల్‌లో ప్రమాదకరంగా వెళ్తున్న దృశ్యం


కలెక్టరేట్ వద్ద రోడ్డుపై అడ్డంగా పడుకున్న పశువులు, ప్రమాదకరంగా వెళుతున్న వాహనదారులు


హౌసింగ్ బోర్డు కాలనీలో యథేచ్ఛగా సంచరిస్తున్న పశువులు

రోడ్లపైనే తిష్ట.. రాకపోకలు ఎట్టా?

నగరంలో పశువుల సంచారం అధికమైంది. ఆవులు, గేదెలను యజమానులు ఇష్టారాజ్యంగా వదిలేస్తుండడంతో రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ పడుకుంటున్నాయి. దీంతో చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సరిగ్గా రోడ్ల మధ్యలో తిష్ట వేసి.. వచ్చి పోయే వాహనాలకు స్పీడ్ బ్రేకర్లుగా తయారవుతున్నాయి. ఒక్కోసారి పశువులు గుంపులు గుంపులుగా వస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు. ఎటునుంచి ఏ పశువు దూసుకొస్తుందో తెలియక వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డుపైకి ఆవులు, గేదెలను వదిలితే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేసిన మున్సిపల్ అధికారులు వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమవుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే చర్యలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో దోమకాటు నివారణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి పేర్కొన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకుని నగరపాలక సంస్థ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టేలా చూడాలన్నారు. అదేవిధంగా చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు. వారంలో ఒక రోజు డ్రై డేను పాటించి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై శిక్షణ
అనంతపురం కార్పొరేషన్: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ తదితర వ్యాధుల నియంత్రణకు నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) ఓబులు శిక్షణ ఇచ్చారు. నగరపాలక సంస్థలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి సందర్భంగా నగరంలోని లలిత కళాపరిషత్తులో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు చంద్ర సినీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరి జరుగుతుందని నిర్వాహకుడు తలారి శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సినీగాయనీ గాయకులతో మధుర గీతాల ఆలాపన, గానగాంధర్వుడికి సంగీత శ్రద్ధాంజలి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కళాభిమానులందరూ విచ్చేయాలని కోరారు.

'కార్పొరేట్' దోపిడీకి కొమ్ముకాస్తున్న విద్యాశాఖ


డీఈఓ వరలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి విద్యాశాఖ అధికారులు అండగా నిలుస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు వాపోయారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం పేరుతో సాగిస్తున్న దోపిడీని నిరసిస్తూ శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు కేపీ రాజు మాట్లాడారు. విద్యాహక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాల్సిన అధికారులు, కార్పొరేట్ విద్యాసంస్థలకు అమ్ముడుపోతున్నారని ఆరోపించారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడం, అధిక ఫీజులు వసూలు చేయడం, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో వేలాది రూపాయల అక్రమంగా వసూలు చేయడం చాలా దుర్మార్గం అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నడుచుకునే కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ప్రజా స్వామ్య పరిరక్షణ సంఘం నారాయణ స్వామి, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ మనవల ఆంజనేయులు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు కేపీ నారాయణ స్వామి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సుబ్బరాయుడు, సాంబశివుడు, జన విజ్ఞాన వేదిక తరిమెల రాజు, సంధ్యారాణి, విద్యార్థి, నిరుద్యోగ ఐక్యవేదిక అధ్యక్షులు టీపీ రామన్న, ఫైట్ ఫర్ రైట్స్ ప్రతినిధులు తోట నాగరాజు, సాకే సుధాకర్, శంకర్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, శీన, నాగ, గణేష్, సిద్ధార్థ బాబు, బంగి ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు


నగరపాలక సంస్థ సిబ్బందిని సన్మానించిన మేయర్ వసీం

అనంతపురం మెడికల్: అన్ని దానాల్లోకెల్లా రక్తదానం చాలా గొప్పదని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులు, రోగులు, గర్భిణులు, బాలింతలకు రక్తం అవసరం అవుతుందన్నారు. సకాలంలో రక్తం ఎక్కించని పక్షంలో మృత్యువాతపడే అవకాశం ఉంటుందన్నారు. యువత సామాజిక స్పృహతో రక్తదానం చేయడానికి ముందుకురావాలన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు రక్తం కొరత లేకుండా రక్తాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులకు రక్తాన్ని అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, ఐసీఎస్‌లు రేష్మ, శోభ, నీలిమ, ప్రసన్న, స్టాఫ్‌నర్సులు సుజాత, సురేష్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది రమణా రెడ్డి, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి
ఆపద సమయంలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థలో గత కొన్నేళ్లుగా రక్తదానం చేస్తున్న సిబ్బందిని సన్మానించారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. నగరపాలక సంస్థలో కొందరు ఉద్యోగులు గత కొన్నేళ్లుగా పది సార్లకుపైగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు బాలాంజనేయులు, అనిల్‌కుమార్ రెడ్డి, అదనపు కమిషనర్ శ్రీ హరి బాబు, ఈఈ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల స్వైర విహారం

- వీధుల్లో నిలిచిన వర్షపు నీరు
- సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం


ఆత్మకూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆత్మకూరు: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో రోడ్లపై వర్షపు నిల్వ ఉంటోంది. పంచాయతీ కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో దుర్వాసన వస్తోంది. ఫలితంగా దోమల సంతతి పెరిగిపోతోంది. అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో బ్లీచింగ్, మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశంలో మలాథియన్ పిచికారీ చేయడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం లేకపోలేదు. దోమకాటుకు గురి కావడం వల్ల విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 200లకు పైగా ఓపీ నమోదు అవుతోంది. ఇది కాకుండా 104 వాహనం ద్వారా వైద్య సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి మరీ ప్రజలకు చికిత్సలు అందిస్తున్నారు. అయినా కూడా ప్రజలు ప్రస్తుతం దోమల బెడదతో అధికంగా జ్వరాల బారిన పడుతున్నారు. కనీసం ఇప్పటికైనా మండల స్థాయి, గ్రామాల్లోని పంచాయతీ అధికారులు స్పందించి దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సారోళ్లు ఎక్కడికి వెళ్లారో?



హంపాపురం సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రాప్తాడు: గ్రామ సచివాలయ ఉద్యోగులు రోజూ విధులకు హాజరై ప్రజల సమస్యలు పరిష్కరించాలి. అయితే మండలంలోని హంపాపురం సచివాలయంలో శుక్రవారం ఇద్దరు ఉద్యోగులు మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగతా ఉద్యోగులు తమ విధులకు డూమ్మా కొట్టారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ గీతాంజలి ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. 12:50 గంటలకు వెల్ఫేర్ అసిస్టెంట్ మంజునాథ్ హాజరయ్యారు. మిగిలిన శాఖల సిబ్బంది ఎక్కడికే వెళ్లారో ఎవరికి తెలియడం లేదు. సమస్యల మీద వచ్చిన ప్రజలు గ్రామ సచివాలయం వద్దకు రావడం సిబ్బంది లేకపోవడంతో మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది అందరూ విధులకు హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పిద్దాం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ

అనంతపురం సెంట్రల్: చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఓబుళదేవనగర్‌లో తల్లులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం వలన చిన్నారుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి పెంపొందడం జరుగుతుందన్నారు. తోటివారితో కలిసిమెలసి ఉండడం వలన సత్సంబంధాలు ఏర్పడి సాంఘిక విలువలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమశ్రీ, నిర్మల, అన్నమ్మ, హెల్పర్లు లక్ష్మి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

2వ సెక్టార్‌లో..
నగరంలో 2వ సెక్టార్ పరిధిలో మారుతీనగర్, సంఘమిత్ర నగర్‌లో 39, 41, 42 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. కొత్త పిల్లలకు స్వాగతం పలుకుతూ.. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి వీడ్కోలు పలికారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం ఇతరత్రా అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు జమున, అంగన్‌వాడీ సిబ్బంది సింధు, సంధ్య, సౌజన్య, రుక్మిణి, ఈశ్వరమ్మ, పద్మజావాణి, శ్యామల, సుకన్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం

- మూడు రోజులుగా తెరచుకోని హంపాపురంలోని అంగన్‌వాడీ కేంద్రం-1


హంపాపురంలోని అంగన్‌వాడీ కేంద్రం-1

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహిస్తూ, చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిపై ఉంది. అయితే మండలంలోని హంపాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం1లో ఇందుకు భిన్నంగా జరుగుతోంది. గత మూడు రోజులుగా సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రం తలుపులు తెరవకపోవడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంగన్‌వాడీ కార్యకర్త బాలగొండ శివలక్ష్మి తన భర్త పార్వతయ్యకు పుట్టపర్తిలో కంటి ఆపరేషన్ చేయించేందుకు ఈనెల 12, 13, 14 తేదీల్లో సెలవు పెట్టింది. ఆమె సెలవులో ఉన్నప్పుడు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయా భాగ్యమ్మ తెరిచి విధులు నిర్వర్తించాలి. అయితే ఆమె కూడా మూడు రోజులుగా అంగన్‌వాడీ కేంద్రం తలుపులు తీయలేదు. అంగన్‌వాడీ కార్యకర్త మూడు రోజులు సెలవులో ఉందని.. మూడు రోజులు తలుపులు తెరచి విధులు నిర్వహించాలని సూపర్‌వైజర్ హేమలత ఆయా భాగ్యమ్మను ఆదేశించింది. అయినా సూపర్‌వైజర్ ఆదేశాలను ఆయా భాగ్యమ్మ బేఖాతరు చేస్తూ మూడు రోజుల పాటు సెంటర్ తీయలేదు.

అంగన్‌వాడీ కేంద్రం తలుపులు తీయలేదని గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత ఈనెల 13న గ్రామానికి వెళ్లి విచారించింది. ఈనెల 12, 13న అంగన్‌వాడీ కేంద్రం తెరవలేదని గ్రామస్తులు తెలిపారు. వెంటనే ఆయా భాగ్యమ్మకు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో చేసేదేమీ లేక చిన్నారులకు భోజనం వడ్డించి పెట్టాలని రెండో సెంటర్ అంగన్‌వాడీ కార్యకర్త శివమ్మకు సూచించారు. 13, 14న రెండో సెంటర్ సిబ్బంది చిన్నారులకు భోజనం వండి పెట్టారు.

మాకు సమాచారం లేదు
అంగన్‌వాడీ ఆయా భాగ్యమ్మ గైర్హాజరుపై తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత తెలిపారు. ఈనెల 12, 13, 14న కార్యకర్త బాలగొండ శివలక్ష్మి తన భర్తకు కంటి ఆపరేషన్ చేపించుకోవాలని లీవ్ పెట్టిందని పేర్కొన్నారు. మూడు రోజుల పాటూ అంగన్‌వాడీ కేంద్రాన్ని చూసుకోవాలని ఆయా భాగ్యమ్మకు తెలిపామన్నారు. అయినా ఆమె మూడు రోజులు తలుపులు తీయలేదు. ఈ విషయం నాకు రెండో రోజు 13వ తేదీ తెలియగానే గ్రామానికి వెళ్లి రెండో సెంటర్‌లో చిన్నారులకు భోజనం పెట్టించడం జరిగిందన్నారు. ఆయా భాగ్యమ్మకు ఫోన్ చేస్తే స్పందించలేదని తెలిపింది. ఆమెకు నోటీసు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఎవర్నీ ఉపేక్షించేది లేదన్నారు. అక్కడి కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతల సేవలకు ఆటంకం కలగకుండా రెండో సెంటర్ ద్వారా సేవలు అందించామన్నారు. 15వ తేదీ అంగన్‌వాడీ కార్యకర్త బాలగొండ శివలక్ష్మి విధులకు హాజరవుతుందని తెలిపారు.

భూసారం పెంపుతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న డీడీఏ మద్దిలేటి

శింగనమల: రైతులు పొలాల్లో భూసారం పెంచుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని డీడీఏ మద్దిలేటి అన్నారు. శుక్రవారం శింగనమలలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై ఆయనతోపాటు ఏడీఏ శైలజ, కేవీకే శాస్త్రవేత్త కిశోర్‌రెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీడీఏ మాట్లాడుతూ నేల ఆరోగ్యం క్షీణించి, భూముల్లో సేంద్రియ కర్బనం అత్యల్ప స్థాయికి పడిపోయిందన్నారు. దీనిని తిరిగి పొంపెందించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందులో భాగంగా పశువుల పేడ వాడాలన్నారు. పచ్చి రొట్ట ఎరువులు అయిన జీలుగ, జనుము, పిల్లి పెసర, మినుము సాగు చేసి భూమిలో కలియదున్నాలన్నారు. జిప్సం వాడకం వల్ల కూడా నేలలో ఉదజని మెరుగుపడుతుందన్నారు. ఏడీఏ మాట్లాడుతూ భూమిలోకి వర్షం నీరు ఇంకేలా వాలుకు అడ్డంగా దున్నుకోవాలన్నారు. రైతులు సాగు చేసే పంట విత్తనాలను విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. స్ప్రింట్ 3 గ్రాములు ఒక కేజీ వేరుశనగ విత్తనాన్ని కలిపి శుద్ధి చేసుకోవాలన్నారు. ట్రైకోడర్మవిరిడి ఒక కేజీ విత్తనానికి 8 గ్రాములు కలిపి శుద్ధి చేసుకోవాలన్నారు. దీనివలన వేరుకుళ్లు తెగులును నివారించవచ్చునన్నారు. ఒక ఎకరాకు 2 కేజీల ట్రైకోడర్మ విరిడీని 90 కేజీల పేడ, 10 కేజీల వేప పిండితో కలుపుకొని 2 వారాలు పాటు గోనె సంచులు కప్పి నిల్వ ఉంచి, తరువాత భూమిలో కలియదున్నాలన్నారు. ఇలా చేయడం వలన వేరుకుళ్లు తెగులు నివారించవచ్చునన్నారు. వర్షం పడినప్పుడు వేరుశనగ విత్తిన 30 రోజులు లేదా 50 రోజుల తరువాత ట్రైకోడర్మని భూమిలో పైపాటుగా వేసుకోవచ్చునన్నారు. వేరుశనగ చుట్టూ జొన్నని రక్షక పంటగా నాలుగు వరుసలు వేసుకోవాలని, దీనివలన చీడపీడల ఉధృతిని అరికట్టవచ్చునన్నారు. రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ కందిలో విత్తన శుద్ధి క్లోర్‌పైరిఫాస్‌తో చేసుకోవడం వలన పంటను 30 రోజుల వరకు రక్షించుకోవచ్చన్నారు. ఆముదం పంట రకాలు అయిన ఐసీహెచ్ -5, ఐసీహెచ్-66 కేవీకేలో అందుబాటులో ఉన్నాయన్నారు. సాగు చేయదలచిన రైతులు కేవీకే రెడ్డిపల్లిలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్, ఏఈఓ అక్కమ్మ, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727